మూతపడ్డ నీటి శుద్ధి కేంద్రం

- వాటర్ ప్లాంట్ నిర్వహణను పట్టించుకోని కమిటీ సభ్యులు
- ఇబ్బందులు పడుతున్న కార్డు హోల్డర్లు

రాజంపేట: మండల కేంద్రంలో గ్రామ వికాస నీటి శుద్ధీకరణ పథకం కింద ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ నిర్వహణ లేక ప్రస్తుతం మూతపడింది. నాలుగు నెలల నుంచి గ్రామ వికాస నీటి శుద్ధీకరణ కేంద్రం మూసి ఉండటంతో కార్డు హోల్డర్లు మంచి నీటి కోసం ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తుంది. నీటి శుద్ధి కేంద్రాన్ని గ్రామంలోని దాతల సహకారంతో 2017లో నిర్మించారు. గ్రామంలోని సుమారు 400 మంది సభ్యులకు సభ్యత్వం కల్పించి ఒక్కొక్కరి దగ్గర రూ.500 తీసుకుని కార్డు హోల్డర్లుగా చేర్చారు. సభ్యత్వం లేని వారికి రూ.5 కాయిన్ ద్వారా నీటిని అందించే వెసులుబాటు కల్పించారు. ప్రారంభంలో నిర్వహణ బాగానే ఉన్న 2 సంవత్సరాల నుంచి పట్టించుకోకపోవడంతో కార్డు హోల్డర్లు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. ప్రస్తుతం నాలుగు నెలల నుంచి మొత్తానికి మూలన పడింది. దీంతో కార్డు హోల్డర్లు ఎవరిని అడగాలో తెలియక సతమవుతున్నారు. ఈ విషయాన్ని చాలా సార్లు గ్రామ పంచాయతీ పాలకవర్గానికి సమాచారం అందించారు. ఇప్పటికీ ఇటు కమిటీ సభ్యుల నుంచి గానీ, అటు గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి సమాధానం లేక పోవడం గమనర్హం. ఇప్పటికైనా కమిటీ సభ్యులు స్పందించి గ్రామ వికాస నీటి శుద్ధీకరణ నిర్వహణ సమస్యకు పరిష్కారం చూపుతారని కార్డుహోల్డర్లు ఆశిస్తున్నారు.



రాజంపేటలో మూసి ఉన్న గ్రామ వికాస నీటి శుద్ధీకరణ కేంద్రం

క్లుప్తంగా

బీమా ప్రొసీడింగ్ కాపీ అందజేత



పిట్లం(జుక్కల్): తిమ్మనగర్ సహకార సంఘం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్, సహకార సంఘం చైర్మన్ సాయిరెడ్డి, లబ్ధిదారురాలికి రూ.5 లక్షల రైతు బీమా ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా సాయిరెడ్డి మాట్లాడుతూ.. తిమ్మనగర్‌కు చెందిన రాజమణి ఇటీవల మృతి చెందడంతో ఆమెకు నామినీ అయిన తల్లి పీరవ్వకు రైతు బీమా ప్రొసీడింగ్ కాపీని అందించామన్నారు. మండల రైతు సమితి అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ శ్రీకర్ రెడ్డి, నాయకులు పండరి, ఏఈవో ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు..



ఎల్లారెడ్డి: సోమార్‌పేట్‌కు చెందిన యువకుడికి మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీ నారాయణ, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సాయి ప్రసాద్‌కు రూ.లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. నాయకులు నారాయణ, అంజాగౌడ్ తదితరులున్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయ రాజగోపుర నిర్మాణానికి ఆదివారం తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి రూ.1,16,000 విరాళంగా అందించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్ తెలిపారు. బీబీపేట మండలం జనగామ గ్రామానికి చెందిన సుభాష్ రెడ్డి ఆలయాభివృద్ధికి ఆర్థిక సహకారం అందజేయగా, ఆలయ కమిటీ ఆయనను శాలువాతో సన్మానించారు. ఆలయ ధర్మకర్తలు రాజిరెడ్డి, నవీన్, రాజనర్సు, తదితరులు ఉన్నారు.

టీ షర్టుల పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): నర్వ గ్రామ యువ క్రీడాకారులకు ఆదివారం కాంగ్రెస్ నాయకుడు భూమాగౌడ్ టీషర్టులు, జర్కిన్లను పంపిణీ చేశారు. నియోజకవర్గ స్థాయి క్రికెట్, కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు జుక్కల్ వెళ్తున్న స్థానిక యువకులకు టీషర్టులు, జర్కిన్లను అందించినట్లు ఆయన తెలిపారు.

బోర్ మోటార్ ప్రారంభం

రామారెడ్డి (ఎల్లారెడ్డి): రామారెడ్డిలో ఎంపీటీసీ నిధులతో ఏర్పాటు చేసిన బోరుబావిని ఆదివారం సర్పంచ్ సంజీవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నీటి వసతి కోసం ఎంపీటీసీ తుపాకుల రజిత నిధులతో బోరుబావిని తవ్వించి, మోటార్‌ను బిగించినట్లుగా పేర్కొన్నారు. ఉప సర్పంచ్ ప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రంగు రవీందర్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుపాకుల రాజేందర్ గౌడ్, పడిగెల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి గ్రామానికి చెందిన యువకుడు పీబీ సత్యం తెలంగాణ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొంది యువతకు ఆదర్శంగా నిలిచాడు. గ్రామానికి చెందిన పెద్దబూరి కర్రె సాయన్న, పోశవ్వ దంపతుల చిన్న కుమారుడు సత్యం. చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఉపాధి హామీ పనులు, కూలీ పనులు చేస్తూ తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని సౌత్ క్యాంపస్ కళాశాలలో ఎంఏ సోషియాలజీ పూర్తి చేశాడు. తెలంగాణ రాష్ట్రంలో సామాజిక కార్యకర్తల ఉద్యోగ ఆవశ్యకత అనే అంశంలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించాడు. ఆయన పరిశోధన గ్రంథాన్ని పరిశీలించిన యూనివర్సిటీ ప్రొఫెసర్లు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేశారు.

ర్యాలీని జయప్రదం చేయాలి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలో నేడు పెద్ద ఎత్తున నిర్వహించే ముదిరాజ్ ధర్మయుద్ధ ర్యాలీని జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు విజయానంద్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాజకీయాల్లో ముదిరాజులకు జనాభా ప్రాతిపాదికన సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

జుక్కల్ అభివృద్ధి కోసమే ఉద్యోగం వదిలేశా

- ఎమ్మెల్యే హన్మంత్ సింధే


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఉద్యోగం వదిలి ప్రజా సేవ కోసం వచ్చానని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. డోంగ్లీ మండలంలోని లింబుర్‌లో రూ.20 లక్షలతో పల్లె దవాఖాన, లింబుర్ నుంచి లింబుర్ వాడి వరకు రూ. 3 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే హన్మంత్ సింధే ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులతో కలిసి శిలాఫలకం ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే నియోజకవర్గంలోని అన్ని మండలాలకు పుష్కలంగా నిధులు వస్తున్నాయని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం కేసీఆర్ హయాంలో నిధులు వచ్చాయని అన్నారు. గతంలో ఎందరో పాలకులు వచ్చిపోయారు కానీ అభివృద్ధి చేసిందే మీలేదని అన్నారు. బస్సీ పటేల్ పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తే మీ సేవకుడిగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగారాం

బిచ్కుంద(జుక్కల్): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని, మీకు సేవకుడిగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం అన్నారు. ఆదివారం బిచ్కుందలో కాంగ్రెస్ పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా గోవా పీసీసీ అధ్యక్షుడు అమిత్ పాట్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగారాం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని, కాంగ్రెస్ కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో ముందుకు వెళ్లాలని కోరారు. అన్ని సర్వేలు అనుకూలంగా ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. ప్రతి గడపకు వెళ్లి గ్యారంటీ పథకాలపై ప్రచారం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

పన్నెండేళ్లుగా.. మట్టితోనే గణపతి

- ఆదర్శంగా నిలుస్తున్న 'మట్టి గణపతి యూత్' సభ్యులు


మట్టి గణపతితో కుమ్మరి మహేశ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మట్టి గణపతికి మంచి ఆదరణ లభిస్తోంది. 12 ఏళ్ల క్రితం సరదాగా మట్టితో 2 ఫీట్ల ఎత్తుతో నల్ల మట్టిని తీసుకొచ్చి గణపతిని తయారు చేసి, నియమ నిష్టలతో తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహించి, సాంప్రదాయ బద్ధంగా గణపతిని చెరువులో నిమజ్జనం చేస్తూ వస్తున్నారు కుమ్మరి మహేశ్ మిత్ర బృందం. ఇప్పుడు వారు అందరి ఆదరణను పొందుతున్నారు. మొదటగా కుమ్మరి మహేశ్‌కు వచ్చిన సొంత ఆలోచనను మిత్రులతో పంచుకున్నాడు. పన్నెండేళ్లుగా చేలల్లో ఉన్న నల్ల మట్టిని తెచ్చి గణపతి విగ్రహాలను తయారు చేస్తున్నారు. మొదటగా రెండు ఫీట్లతో తయారు చేసిన మట్టి గణపతిని సంవత్సరానికి కొంత ఎత్తును పెంచుతూ ప్రస్తుతం 14 ఫీట్ల ఎత్తుతో మట్టి గణపతిని తయారు చేశారు. విగ్రహం తయారీ కోసం వరి గడ్డి, ఇనుప చువ్వలు, కుండల మట్టి, కర్రలు, ప్లైఉడ్, థర్మకోల్‌ను ఉపయోగించినట్లు వారు పేర్కొన్నారు. మహేశ్ అనే యువకుడు మంచి ఆర్టిస్ట్‌గా పేరుంది. త్రీడి పెయింటింగ్, వాల్ మ్యూరల్స్, గుళ్లు, ఇళ్లలో రంగుల వేయడంలో మంచి నేర్పరి. గ్రామంలో మట్టితో తయారు చేసిన ఈ గణపతికి ప్రతి రోజు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున వచ్చి తమ భక్తిని చాటుతున్నారు. శభాష్ మహేశ్ అంటూ మెచ్చుకుంటున్నారు. నేటి యువతకు మట్టి గణపతి యూత్ సభ్యులు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ధర్మయుద్ధం ర్యాలీకి పెద్ద ఎత్తున తరలి రావాలి


బుడిమిలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు


లింగంపేటలో..


నస్రుల్లాబాద్‌లో..

బాన్సువాడ రూరల్: సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే ముదిరాజుల ధర్మయుద్ధం ర్యాలీకి ప్రతి గ్రామం నుంచి కులస్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని సంఘం మండల నాయకులు కోరారు. ఆదివారం బుడిమిలో ముదిరాజ్ కులస్తులతో కలిసి ధర్మయుద్ధం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. హలో ముదిరాజ్- చలో కామారెడ్డి అని పిలుపునిచ్చారు. మంత్రి గణేష్, మంద సాయిలు, నర్సరవి, అంబయ్య, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): కోమట్‌పల్లిలో ముదిరాజ్ నాయకులు ఆదివారం ధర్మయుద్ధం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ముదిరాజ్‌ల సత్తా చాటుతామన్నారు. రవికుమార్, రాజయ్య పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్‌లో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో ఆదివారం ధర్మయుద్ధం వాల్‌పోస్టర్లను ముదిరాజ్ సంఘం నాయకులు ఆవిష్కరించారు. సంఘం సభ్యులు అరిగెసాయిలు, దొంతిరాం కాశీరాం, గణేశ్, నాగేష్, మల్లేష్, విఠల్, మహేందర్, సాయిలు, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించాలి

భిక్కనూరు: ముదిరాజులకు ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న ముదిరాజుల ధర్మయుద్ధం సభకు భిక్కనూరు మండలం నుంచి 5 వేల మంది బయలు దేరి వెళ్తున్నారని మండల ముదిరాజు సంఘం అధ్యక్షుడు బండి రాములు తెలిపారు. ఆదివారం ఆయన భిక్కనూరులో మాట్లాడారు. ముదిరాజులను రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నాయని, ముదిరాజుల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ముదిరాజు సంఘం ప్రతినిధులు అంజనేయులు, రమేశ్, సిద్ధరాములు, నర్సింలు, సిద్ధరాములు పాల్గొన్నారు.

వైభవంగా గురు మహరాజ్ పల్లకి ఊరేగింపు



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో ఆదివారం గురు మహరాజ్ పల్లకీ ఊరేగింపు సేవా కార్యక్రమం వైభవంగా జరిగింది. ప్రతి సంవత్సరం గణేశ్ నవరాత్రుల్లో వచ్చే దశమి రోజున ఆర్యవైశ్యుల గురువైన గురు మహరాజ్ పుణ్యతిథి కార్యక్రమం నిర్వహిస్తామని భక్తులు తెలిపారు. స్థానిక గురు మఠంలో భక్తులు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పల్లకి ఊరేగింపు, భజన కార్యక్రమం నిర్వహించారు.

కాచాపూర్ కురుమ యువచైతన్య సమితి కార్యవర్గం

భిక్కనూరు: కాచాపూర్ గ్రామ కురుమ యువచైతన్య సమితి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంగెపు శ్రీనివాస్ కురుమ, ఉపాధ్యక్షుడిగా దెబ్బ నరేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంగెపు మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా సంగెపు గంగారాం, కోశాధికారిగా బుల్లె యాదయ్య, ప్రచార కార్యదర్శిగా సంగెపు స్వామి, కార్యదర్శిగా సంగెపు నవీన్ సలహాదారులుగా సంగెపు మల్లేశ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వీరికి జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్ నియామకపత్రాలు అందజేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెద్దోళ్ల మహేశ్, జిల్లా ఉపాధ్యక్షులుగా ఎర్రోళ్ల స్వామి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాలాల రవి పాల్గొన్నారు.


లచ్చాపేట కురుమ చైతన్య సమితి కార్యవర్గం

మాచారెడ్డి: లచ్చాపేట గ్రామ కురుమ చైతన్య సమితి నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడారి పరుశురాములు, ఉపాధ్యక్షుడిగా దేవయ్య, ప్రచార కార్యదర్శిగా లింగం, కోశాధికారిగా స్వామి, ప్రధాన కార్యదర్శిగా రాములు, కార్యదర్శిగా మహేష్‌లను ఎన్నికయ్యారు.

లంబోదరుడికి ప్రత్యేక పూజలు


జిల్లా వ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం భక్తులు గణేశ్ మండపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అన్నదానాలు చేశారు. కొన్ని చోట్ల విగ్రహాలను శోభాయాత్రకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్


నిజాంసాగర్‌లో గణేశుడికి స్వీట్లతో నైవేద్యం


కామారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయ గణేశుడ్ని నిమజ్జనానికి తరలిస్తూ..


అక్కంపల్లిలో కుంకుమార్చనలు


బీబీపేట: వాసవి క్లబ్ అధ్వర్యంలో..


జిల్లా కేంద్రంలోని రాంమందిర్‌లో..


తాడ్వాయిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..


దేవునిపల్లిలో వినాయకుని వద్ద భక్తుల పూజలు


తాడ్కోల్ బీడీవర్కర్స్ కాలనీలో..


మద్నూర్: మేనూర్‌లో యజ్ఞం చేస్తున్న గ్రామస్తులు






ఎల్లారెడ్డిలో మహిళలకు ముగ్గుల పోటీలు.. సదాశివనగర్:మండపాల నిర్వాహకులకు లడ్డూలను అందజేస్తున్న రమేశ్ రెడ్డి..కామారెడ్డి కాకతీయనగర్‌లో..

సమాచారం..

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంతో పాటు అచ్చంపేట, మల్లూర్, గోర్గల్ గ్రామాల్లో సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభరాజు చేతుల మీదుగా పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎంపీపీ పట్లోళ్ల జ్యోతిదుర్గారెడ్డి తెలిపారు. కార్యక్రమాలకు పార్టీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేడు బోర్లంక్యాంపునకు స్పీకర్ రాక

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపులో సోమవారం మధ్యాహ్నం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పర్యటించనున్నట్లు గ్రామ సర్పంచ్ నాన్కు పీర్యానాయక్ తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయితీ భవనం ప్రారంభంతో పాటు నిరుపేదలకు ఇంటి స్థలాలు, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణీ , సీసీ రోడ్ల ప్రారంభం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

25న మండల సమాఖ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఈ నెల 25న మండల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం రవీందర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల సమాఖ్య అధ్యక్షురాలి అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు.

గోవా పీసీసీ అధ్యక్షుడికి ఘనస్వాగతం


స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

నిజాంసాగర్(జుక్కల్): గోవా పీసీసీ అధ్యక్షుడు అమిత్ పాట్కర్‌కు ఆదివారం నర్సింగ్‌రావ్ పల్లి చౌరస్తా వద్ద కాంగ్రెస్ నేత తోట లక్ష్మీకాంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో గ్యారంటీ కార్డుల పంపిణీ కార్యక్రమానికి అమిత్ పాట్కర్ ముఖ్యఅథితిగా హాజరయ్యారు. నాయకులు జయప్రదీప్, బాల్‌సాయిలు, శేఖర్ తదితరులున్నారు.

సంక్షిప్తం

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం

నిజాంసాగర్(జుక్కల్): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని చంద్రమౌళీశ్వరాలయం వద్ద ఆదివారం స్థానిక నాయకులు రోడ్లను శుభ్రం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగారాం ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నాయకులు సందీప్, లింగాగౌడ్, సాయిలు తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేనివారికి, సీటు బెల్టులు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానాలు విధించారు. ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై సంజీవులు, కానిస్టేబులు, హోంగార్డులు పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

మాచారెడ్డి: యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అరికెల ప్రభాకర్ యాదవ్ అన్నారు. పాల్వంచ మండలం వాడి గ్రామంలో ఏర్పాటు చేసిన యాదవ సంఘం మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాజకీయంగా వెనుకబడిన యాదవులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు కొమురయ్య మహేష్, మహేందర్, బాలరాజ్, లింగం కొమురయ్య, నరసయ్య, హరీష్, సాకేత్ ఉన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరాలు

రాజంపేట: కొండాపూర్‌లో ఆదివారం మదన్ మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు భీంరాజ్, సాయిలు, బలేందర్, బస్సీలాల్, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. 126 మందికి పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు కృష్ణమూర్తి, కొప్పుల నర్సారెడ్డి పాల్గొన్నారు.

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపలిలోని హేరంబ క్లబ్ లయన్స్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుస్మిత భవంతి 113 మందికి వైద్య పరీక్షలు చేశారు.

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా సంఘ భవనంలో ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ మెడివిజన్ కంటి ఆస్పత్రి వైద్యులు 50 మంది విశ్రాంత ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించి వీరిలో ఆరుగురుకి మోతి బిందు ఉన్నట్టుగా గుర్తించారు. వీరందరికి విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య బీమా పథకం కింద ఉచిత అపరేషన్లు చేయడానికి హైదరాబాద్‌కు తీసుకుపోయినట్టు సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టు విఠల్ రావు, ప్రతినిధి నాగాగౌడ్‌లు తెలిపారు.